క్లుప్తంగా

పెదతాడివాడలో నమస్తే డే



క్లాప్ మిత్రలకు రైస్‌బ్యాగ్, పీపీఈ కిట్ల అందజేత

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ గ్రామంలో నమస్తే డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో డివిజినల్ పంచాయతీ అధికారి రౌతు శిరీషరాణి పాల్గొని క్లాప్‌మిత్రలకు రైస్ బ్యాగ్, పీపీఈ కిట్ పంపిణీ చేశారు. ఆరోగ్య పరీక్షలు కూడా చేయించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్త గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో తాగునీటి పైపులైన్ పనులు



ఏతపేటలో జరుగుతున్న తాగునీటి కుళాయి పనులు

పూసపాటిరేగ : మండల కేంద్రం పూసపాటిరేగ ఏతపేటలో మండల పరిషత్ నిధులు సుమారు రూ.3 లక్షలతో తాగునీటి పైపులైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎంతో కాలంగా ఏతపేట కాలనీకి తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎంపీపీ మహంతి కల్యాణి మండల పరిషత్ నిధులు మంజూరు చేయడంతో పూసపాటిరేగ సర్పంచ్ టి.సీతారాం పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే సుమారు 200 గృహాలకు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.

మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



పదవీ ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ ప్రతినిధులు

డెంకాడ: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ భోగాపురం యూనిట్ అధ్యక్షుడిగా డెంకాడ మండల పరిషత్ సీనియర్ సహాయకులు కె.రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం డెంకాడ మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ భోగాపురం యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నిక అధికారిగా బి.శ్రీనివాసరావు, పరిశీలకులుగా పీఎం రవికుమార్ వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా వైఎస్సార్ నాయుడు, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీదేవి, ట్రెజరర్‌గా జి.ప్రశాంతికుమార్, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ – 1గా బీవీ గోవిందరావు, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్‌గా – 2గా కె.చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వారు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



గుడివాడలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో వెనుకబడిన వారి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని కరకవలస, గుడివాడ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్, రికార్డులు పరిశీలించి, విద్యాబోధనపై ఆరా తీశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే



చార్టులు, ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన చార్టులను ప్రదర్శించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.విజయ మాట్లాడుతూ.. యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. వృత్తివిద్యా ఉపాధ్యాయులు జగదీష్, దేవి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే వృత్తివిద్యా కోర్సులు నేర్చుకోవడం మంచిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, క్విజ్ కాంపిటేషన్, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం

- నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



డి.తాళ్లవలసలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

డెంకాడ: ఎన్నికల ముందు కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలు నమ్మి ఓటేసిన ప్రజలు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకపోవడంతో మోసపోయామని బాధపడుతున్నారని, అలాంటి ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలస, అమకాం, రఘుమండ, ఆర్.తమ్మాపురం, గంట్లాం పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నె బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ మోసానికి కేరాఫ్‌గా చంద్రబాబు ఉన్నారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలు అదనంగా ఇస్తామని సంతకాలు పెట్టి మరీ మ్యానిఫెస్టో సంతకాలతో విడుదల చేశారన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా ఇంతవరకూ ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ నెలలో ఏ పథకాలు ఇస్తామో అన్నది ఒక క్యాలెండర్ రూపొందించి దాని ప్రకారం తూచా తప్పకుండా ఇచ్చారన్నారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలైన నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, ఆడ పిల్లలకు ఆర్థిక సహాయ పథకం, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ వంటి పథకాలు ఎక్కడ అమలు చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట సాగు సాయం ఎంత చేశారో వివరించాలన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తాను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వంద కంపెనీలను తెస్తానని చెప్పారని, 13 నెలలు గడిచిందని, ఎన్ని కంపెనీలు తెచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. మోసపూరిత మాటలతో కూటమి నేతలు అధికారంలోకి వచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కూటమి నేతల హామీలకు మోసపోయామని బాధపడుతున్న ప్రజల గొంతుకుగా పని చేయాలని తమకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. కార్యక్రమాల్లో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, కరుమజ్జి త్రినాథరావు, అట్టాడ రమణ, ఎర్ర శ్రీనివాసరావు, గూడేల విష్ణు, లెంక లక్ష్మణరావు, కోరాడ కనకరాజు, రేగాన శ్రీనివాసరావు, పుర్రె రాము, సంతోషి, పతివాడ కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



డి.తాళ్లవలసలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విద్యుత్ హమాలీలకు స్మార్ట్ మీటర్ల భారాలు, నష్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వినియోగదార్లపై ధరలు భారం పడి నష్టం కలిగిస్తాయని తెలిపారు. ఇప్పటికే ప్రజలు తీవ్ర విద్యుత్ చార్జీల భారంతో ఇబ్బందులు పడుతుంటే స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అదానికి లాభాలు తెచ్చే విధంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తుందని, దీనివల్ల ప్రజలపై కోట్లాది రూపాయలు భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిల్లు పెరుగుదల వల్ల అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా ట్రూ అప్ చార్జీల పేరిట కోట్లాది రూపాయలు దోచుకున్న ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పేరిట మరింత దోచుకోవడాన్ని అన్ని వర్గాల ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, లెంక గోవిందరావు, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను, పతివాడ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దుకాణాల తనిఖీ



నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్న నగరపాలక సంస్థ సిబ్బంది

విజయనగరం: పట్టణంలోని పలు దుకాణాలపై ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రాంతంలో ఉన్న మూడు పెద్ద ప్లాస్టిక్ దుకాణాలు, నాలుగు చిన్న ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించి, 380 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించారు. అక్టోబర్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయబోతుందని అన్నారు. ఇందులో భాగంగా నగరంలో ఎక్కడ ప్లాస్టిక్ వినియోగం గానీ విక్రయాలుగానీ చేపట్టరాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించుకునే విధంగా చైతన్యవంతులు కావాలన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ నిషేధ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజలకు మరింత చేరువగా పౌర సేవలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నగర పాలక సంస్థ కమిషనర్, సిబ్బంది

విజయనగరం: ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తూ మెరుగైన పౌర సేవలను మరింతగా అందించేందుకు కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పుర మిత్ర యాప్ నిక్షిప్తం, టిడ్కో గృహ సముదాయాల మౌలిక సదుపాయాలు, పన్నుల వసూళ్లు, వీధివిక్రయదారుల సర్వే, పందుల సంచారాన్ని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలు, వీధి కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పన్నులు వసూళ్లలో వృద్ధి రేటు సాధించినప్పటికీ శతశాతం పన్ను వసూలే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిశీలించే దిశగా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను మరింతగా అమలు చేస్తూ మెరుగైన సులభతరమైన పౌర సేవలు అందే విధంగా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి డా. కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్వో సింహాచలం పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

బొబ్బిలిరూరల్: తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీఓ జె.వి.వి.రామ్మోహనరావు బీఎల్ఓ లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బీఎల్ఓలకు అయిదో రోజు బుధవారం ఇచ్చిన శిక్షణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వారి పూర్తి వివరాలను సేకరించి, విచారించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం 6 సేకరించాలని, జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఫారం-7, సవరణకు ఫారం-8ను వినియోగించాలని సూచించారు.

• ఈ మార్కెట్‌కి ఏమైంది..!



ఈ చిత్రాలు జిల్లా కేంద్రం విజయనగరంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న మార్కెట్‌లో కనిపిస్తున్నవి. వీటిని చూస్తే సినిమా థియేటర్లలో ముందుగా వేసే.. ఈ నగరానికి ఏమైంది.. అన్న ప్రకటనలా తయారైంది. మార్కెట్ రహదారి నిత్యం కొనుగోలుదారులు, వ్యాపారులతో రద్దీగా ఉంటుంది. కానీ చిన్నపాటి వర్షం పడినా.. దీని పరిస్థితి ఇలానే ఉంటుంది. ఇది విజయనగరం మార్కెట్ కాదు.. విజయనరకం మార్కెట్.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం







పాత బస్టాండ్ రోడ్డులో బురదమయంగా మారిన మార్కెట్

'గిరిజనులే తొలి స్వాతంత్య్ర సమరయోధులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఇంచార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసన్

విజయనగరం అర్బన్: ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ఆధ్వర్యంలో సంకలనం చేసిన 'గిరిజనులే తొలి స్వాతంత్య్ర సమరయోధులు' పుస్తకాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఇంచార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ఇంచార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా సంయుక్తంగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సమరంలో గిరిజనుల సహకారం అపారమైనదని తెలిపారు. భారతదేశ పౌరులు నేడు స్వేచ్ఛా స్వాతంత్య్రాలతో జీవిస్తున్నారంటే అది తమ ప్రాణాలను పణంగా పెట్టిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగం వల్లనే సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. ఇంచార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మిశ్రా మాట్లాడుతూ గిరిజనుల సహకారం లేకుండా తెల్లదొరలను దేశం నుంచి పారద్రోలడం సాధ్యపడేది కాదన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ జిల్లా అధ్యక్షుడు గీతారెడ్డి, సెక్రటరీ డాక్టర్ దాసరి నారాయణ, నగర అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎం.డిని కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైమ్ : ఆర్టీసీ ఎం.డి సీహెచ్.ద్వారక తిరుమలరావును ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం నగరంలోని కంటోన్మెంట్ పోలీసు అతిథిగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పూల మొక్కను ఆయనకు అందజేశారు.



ఆర్టీసీ ఎం.డికి పూల మొక్కను అందజేస్తున్న ఎస్పీ

కలెక్టర్‌ను కలిసిన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

విజయనగరం అర్బన్: గోవా గవర్నర్‌గా పదవిని చేపట్టబోతున్న కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు బుధవారం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలెక్టర్ చాంబర్‌లో కలిశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించారు. కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మాట్లాడుకున్నారు. పెద్ద చెరువుపై మూలకు చేరిన తాగునీటి శుద్ధజల పథకాన్ని బాగు చేయమని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కి వినతి ఇచ్చామని, ఏడాది పూర్తయిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవా గవర్నర్‌గా నియమితులైనందుకు ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న అశోక్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు, ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



జిల్లా కంటోన్మెంట్ వాటర్ ట్యాంక్ వద్ద కార్మికులు నిరసన

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు చెల్లించాలని, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు పదో తేదీలోపు ఇవ్వాలని, సమ్మె ఒప్పంద జీవోలు, ఖాళీలు భర్తీ చేయాలను కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కంటోన్మెంట్ వాటర్ ట్యాంక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చిన్న, ఆదినారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందనీ ఆశించామని అన్నారు. సంవత్సరం కాలం పూర్తయిన నేటికీ జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదని ధ్వజమెత్తారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా జూలై 12 అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తున్నామన్నారు. విజయనగరంలో నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే ఇక్కడ కూడా సమ్మెకు వెళ్తామని తెలిపారు. ప్రస్తుత ధరల్లో రూ.11,000, రూ.12,000, రూ.15,000 లతో ఎలా బతకాలని ప్రశ్నించారు. థర్డ్ పార్టీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, కార్మికుని వాటర్‌తో సమానంగా యాజమాన్యం వాటా కూడా చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ టెండర్లలో థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించే విధంగా కోడ్ చేయాలని, పదవ తేదీలోపు జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు, గౌరీ, రమేష్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షురాలు ఎం.బబిత



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వాన్ని ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షురాలు ఎం.బబిత అన్నారు. న్యూఢిల్లీకి చెందిన జాతీయ న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాలతో బుధవారం జిల్లా కోర్టులో మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, బ్యాంక్ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనే ప్రక్రియ చాల సులువైనదని, ఖర్చులేనిదన్నారు. అనంతరం మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా కోర్టు ఆవరణం నుంచి పూల్‌బాగ్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పేరాలీగల్ వలంటీర్స్, కోర్టు సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు నినాదాలు చేశారు. న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, భారత అధ్యక్షులు కలిశెట్టి రవిబాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఈగల్ టీమ్ హెడ్

విజయనగరం క్రైమ్ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ హెడ్ విజయకుమార్ అన్నారు. తోటపాలెంలోని ఏజీఎల్ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, చదువు, తమ బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. చెడు అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగంపై ఎటువంటి సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని కోరారు. కోటేశ్వరరావు, వెంకటేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.